సాక్షి మంచిర్యాల

బుధవారం । 7 । జూన్ । 2023



ఐటీఐతో ఉపాధికి భరోసా

జిల్లాలోని ఐటీఐలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. 8లో▸

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

నస్పూర్: పట్టణ పరిధిలో కేజీబీవీలో ఇంటర్‌లో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రత్యేక అధికారి మౌనిక తెలిపారు. సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూపుల్లో మొదటి సంవత్సరానికి బుధవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ప్రతీ గ్రూపులో 30 సీట్లు ఉన్నాయని, సర్టిఫికెట్లతో విద్యాలయానికి రావాలని, మరిన్ని వివరాలకు 63015 47545 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

గరిష్టం/కనిష్టం
42.0 /30.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. రాత్రి వేళ పాక్షికంగా మేఘావృతం అవుతుంది. పడమర దిశగా వేడిగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'కేసీఆర్ వల్లే సింగరేణి ఇళ్ల పట్టాలు'



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

శ్రీరాంపూర్: ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లే సింగరేణి ప్రాంతంలో ఇల్లు కట్టుకున్న వారికి నేడు పట్టాలు అందుతున్నాయని పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత అన్నారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధి శ్రీరాంపూర్ ఏరియాలో సింగరేణి స్థలాల్లో ఇల్లు కట్టుకున్న సుమారు 250 మందికి 76 జీవో కింద ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. మంగళవారం సింగపూర్ పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావుతో కలిసి ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం, ఏ ముఖ్యమంత్రి కూడా పరిష్కరించని సమస్యను నేడు కేసీఆర్ పరిష్కరించి పట్టాలిప్పించారని అన్నారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా కేసీఆర్, తాను కాక మరొకరు ఎమ్మెల్యేగా గెలిచి ఉంటే ఇళ్ల పట్టాలు వచ్చి ఉండేవి కావన్నారు. పనిచేసే వారికే ఓటేయాలని, తిండి పెట్టాడని, చీరలు ఇచ్చారని నమ్మి ఓటేస్తే మోసపోతారని అన్నారు. 9న ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శీను, కౌన్సిలర్లు పూదరి కుమార్, పంబాల గంగ, బెడికే లక్ష్మీ, బౌతు లక్ష్మీ, బండి పద్మ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న రేషన్ డీలర్లు

బెల్లంపల్లిరూరల్: రేషన్ డీలర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని రేషన్ డీలర్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం బెల్లంపల్లిలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల సంఘం బెల్లంపల్లి అధ్యక్షుడు దుర్గం రాజేశం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురికూరి చంద్రయ్య మాట్లాడుతూ ప్రభుత్వ నిరంకుశ ధోరణిని వ్యతిరేకిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 3 నుంచి సమ్మెలో పాల్గొంటున్నామని తెలిపారు. డీలర్లు ముఖేష్ పాండే, నారాయణ, హరీష్ పాండే, భూమయ్య, సుజాత, సుశీల, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా పవర్‌ప్లాంటు షట్‌డౌన్ పనులు



పనులు పరిశీలిస్తున్న డైరెక్టర్

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంటులో యూనిట్–1(600మెగా వాట్ల) సీవోహెచ్(క్యాప్టల్ ఓవర్‌హాలింగ్) పనులు వేగంగా చేపడుతున్నట్లు సంస్థ డైరెక్టర్(ఈఅండ్‌ఎం) డి.సత్యనారాయణరావు తెలిపారు. మంగళవారం ఆయన షట్‌డౌన్ పనులు, ఎఫ్‌జీడీ నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ నెల 30వరకు పూర్తికి చర్యలు తీసుకోవాలని, అందుకు తగిన సిబ్బందిని పెంచాలని సూచించారు. ఎఫ్‌జీడీ పనులు ముమ్మరం చేయాలని సూచనలు చేశారు. పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భాగంగా ఎస్టీపీపీ సోమవారం రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పర్యావరణ ప్రాక్టిసెస్ అవార్డు అందుకోవడం అభినందనీయమని, అధికారులు, ఉద్యోగులను అభినందించారు. ఎస్టీపీపీ సీటీసీ సంజయ్‌కుమార్ సూర్, వోఅండ్‌ఎం చీఫ్ జెన్‌సింగ్, జీఎం సూర్యనారాయణరాజు, జీఎం పీసీఎస్ ఇంచార్జి కమలాకర్ భూషణ్, ఏజీఎంలు సత్యనారాయణప్రసాద్, సుధాకర్, శ్రీనివాసులు, డీజీఎం పర్సనల్ కేసా సత్యనారాయణరావు పాల్గొన్నారు.

జన సమీకరణే లక్ష్యం



నస్పూర్‌లో బహిరంగ సభాస్థలిలో జేసీబీలతో చదును చేస్తున్న దృశ్యం



కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో సిద్ధమైన రోడ్డు



కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటుతున్న కూలీలు

- లక్ష మందిని తరలించేలా ప్రణాళిక
- కలెక్టరేట్, బహిరంగ సభకు సన్నద్ధం
- సీఎం పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: నూతన కలెక్టరేట్ భవనం, ఇతర అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు జిల్లాకు వస్తున్న సీఎం కేసీఆర్ పర్యటన విజయవంతంపై అటు అధికారులు, ఇటు బీఆర్ఎస్ శ్రేణులు దృష్టి సారించారు. నస్పూర్‌లో కొత్తగా నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయాల భవనం ప్రారంభోత్సవానికి ఈ నెల 9న ముఖ్యమంత్రి రానున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కలెక్టరేట్ సమీపంలోనే అదే రోజు సాయంత్రం 4గంటలకు నిర్వహించే భారీ బహిరంగ సభకు జన సమీకరణ కోసం స్థానిక ఎమ్మెల్యేలు సన్నద్ధం అవుతున్నారు. ఇందుకోసం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ తదితర నేతలు సభ విజయవంతం చేసేందుకు కార్యాచరణలో నిమగ్నమయ్యారు. సీఎం సభకు కనీసం లక్ష మందిని తరించేలా ప్రణాళిక వేశారు. ఇందుకోసం మూడు నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు, అభిమానులను తరలించనున్నారు. ఈ సభకు చెన్నూరు నియోజకవర్గం నుంచే 65వేల మంది వరకు తరలించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. సభకు జనాన్ని తరలించేందుకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలను సిద్ధం చేస్తున్నారు. గ్రామాలు, మండలాలు, నియోజకవర్గ నాయకులతో సభ సక్సెస్ చేసేలా సన్నద్ధం అవుతున్నారు. ఐదేళ్ల తర్వాత సీఎం పర్యటన కావడం, అసెంబ్లీ ఎన్నికల ముందు సభ నిర్వహిస్తుండడంతో అధికార పార్టీ నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు.

సభాస్థలంలో ఏర్పాట్లు

నస్పూర్ పట్టణం కొత్త కలెక్టరేట్ సమీపంలోనే బహిరంగ సభ నిర్వహించనున్నారు. పక్కనే బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం, అటు వైపు కలెక్టరేట్ ఉంది. ఈ క్రమంలో రెండింటిని ప్రారంభించిన అనంతరం సీఎం సభలో పాల్గొంటారు. ఇందు కోసం సభాస్థలాన్ని చదును చేస్తున్నారు. రాకపోకల కోసం రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు. భారీ వేదిక కోసం స్థలాన్ని సిద్ధం చేస్తున్నారు. వాహనాల పార్కింగ్, వీఐపీ, వీవీఐపీల ప్రత్యేకంగా దారులు, సభకు చేరుకునేందుకు రూట్ మ్యాప్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అక్కడికి వచ్చిన వారి కోసం ప్రత్యేక చోట్ల భోజనాలు, సభలో తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు, మొబైల్ టాయిలెట్లు, అంబులెన్సు అందుబాటులో ఉంచనున్నారు. భారీగా పార్టీ జెండాలు, కటౌట్లు, ఫ్లెక్సీలతో ప్రచారం చేస్తున్నారు. ఈ మేరకు నాయకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

చకచకా కలెక్టరేట్..

కొత్త కలెక్టరేట్ భవనంలో మిగిలిన పనులను వేగంగా పూర్తి చేస్తున్నారు. ప్రారంభోత్సవానికి రెండు రోజుల గడువు ఉండడంతో పనులు వేగంగా సాగుతున్నాయి. ఎమ్మెల్యేలు, కలెక్టర్ బాదావత్ సంతోష్ ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తున్నారు. పనులు పూర్తి చేసేందుకు ప్రత్యేకంగా అధికారులను నియమించారు. కొత్త భవనంలో లైటింగ్స్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మొక్కలు నాటడం, గార్డెనింగ్, ఆఫీసుల్లో ఫర్నిచర్, రోడ్లు, తదితర పనులు పూర్తి చేయిస్తున్నారు. వేగంగా పనులు పూర్తి చేసేందుకు ఎక్కువ సంఖ్యలో కూలీలతో రాత్రింబవళ్లు పని కొనసాగుతోంది. ప్రారంభోత్సవం రోజున పూజ, కలెక్టర్ చాంబర్, హాల్, సీఎం సందర్శించే ఆఫీసులను ముస్తాబు చేస్తున్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేయాలి



భవనాన్ని సందర్శిస్తున్న ఎంపీ, విప్

నస్పూర్: జిల్లాలో ఈ నెల 9న తలపెట్టిన సీఎం కేసీఆర్ పర్యటన విజయవంతానికి చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ఎంపీ బోర్లకుంట వెంకటేశ్‌నేత, కలెక్టర్ బాదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ బి.రాహుల్, మంచిర్యాల డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌తో కలిసి సందర్శించారు. జిల్లా శాఖల కార్యాలయాలు, దరఖాస్తుదారులు వేచి ఉండే ప్రాంతాలు, భవన ప్రాగంణం, గార్డెనింగ్‌ను పరిశీలించారు. ఈ సందరర్భంగా సుమన్ మాట్లాడుతూ నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ భవనం ప్రారంభానికి ముస్తాబైందని తెలిపారు. అనంతరం ఈ నెల 8, 9, 10వ తేదీల్లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో నిర్వహించనున్న ఫిష్ ఫెస్టివల్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

బహిరంగ సభ స్థలం పరిశీలన

ఈ నెల 9న సీఎం కేసీఆర్ జిల్లా పర్యటన సందర్భంగా నస్పూర్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభాస్థలిని, వేదికను ఎంపీ బోర్లకుంట వెంకటేశ్‌నేత, విప్ బాల్క సుమన్ స్థానిక ఎమ్మెల్యే దివాకర్‌రావు, డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌తో కలిసి పరిశీలించారు. భద్రత చర్యలపై పోలీసు అధికారులతో చర్చించారు. బహిరంగ సభ వేదిక, విద్యుత్ సరఫరా, పార్కింగ్, ఇతర పనులను పరిశీలించారు. సీఎం పర్యటించే ప్రాంతాల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించాలని సూచించారు.

ధాన్యం డబ్బులేవి..?



కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యం

- అమ్మిన వరి ధాన్యానికి అందని నగదు
- నెల రోజులుగా ఎదురుచూపులు
- వానాకాలం సాగుకు సిద్ధమవుతున్న రైతులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఆరుగాలం కష్టపడి కష్టాల కోర్చి.. వడగండ్లు.. అకాల వర్షాలు దాటుకుని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులు నగదు డబ్బుల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. రోజుల తరబడి తూకం లేక.. రవాణాకు లారీలూ లేక.. తరుగు కోతతో విసుగు అన్నదాతలు ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టాల్సి వచ్చింది. ఎట్టకేలకు ధాన్యం విక్రయించినా 30శాతం మంది రైతుల ఖాతాల్లో కూడా నగదు జమ కాని పరిస్థితి నెలకొంది. మరోవైపు వర్షాకాలం సీజన్ మొదలైంది. ఇప్పటికే దుక్కులు దున్ని యాసంగి పంటలు తొలగించి చదును చేసుకున్నారు. తొలకరి వర్షాలు పడే లోపే విత్తనాలు, ఎరువులు సమకూర్చుకునేందుకు ఎదురు చూస్తున్నారు. యాసంగి ధాన్యం అమ్మిన నగదు వస్తే పెట్టుబడికి ఇబ్బంది ఉండదని రైతులు నెల రోజులుగా ఎదురు చూస్తున్నారు. మృగశిర కార్తె నుంచి సాగు పనులు వేగవంతం చేస్తామని డబ్బులు అందితే ఇబ్బంది ఉండదని అంటున్నారు. ట్యాబ్‌ఎంట్రీ, సాంకేతిక కారణాలతోనే నగదు జమ ఆలస్యమవుతోందని అధికారులు పేర్కొంటున్నారు.

సేకరణా.. చెల్లింపులూ ఆలస్యం

జిల్లాలో 94,264 ఎకరాల్లో వరి సాగు కాగా 2.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏప్రిల్19 నుంచి 262 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ఇప్పటివరకు 1,58,593.480 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. 21,536 మంది రైతుల నుంచి రూ.310,84,32,208 విలువైన ధాన్యం సేకరించారు. ఇప్పటి వరకు 2,495 మంది రైతులకు గాను రూ.36,31,63,464 నగదును ఖాతాల్లో జమ చేశారు. ఆలస్యం లేకుండా నగదు చెల్లింపులు ఉంటాయని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నా.. నెల రోజులు గడుస్తున్నా నగదు ఖాతాలో జమ కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం ఈ నెల 10 నుంచి 15వరకు ధాన్యం సేకరణ పూర్తి చేసి కొనుగోలు కేంద్రాలు మూసివేయాలని ఆదేశిస్తోంది. దీంతో ఆలస్యంగానైనా తేరుకున్న అధికారులు వారం పది రోజులుగా ఆగమేఘాలపై సీజన్ ముగింపు దశలో రవాణా శాఖ, పౌరసరఫరాల శాఖ అధికారులు కలిసి రహదారిపై ఖాళీగా వెళ్తున్న లారీలను ఆపి కేంద్రాలకు తరలించి ధాన్యం తరలింపు వేగవంతం చేశారు.

అడుగడుగునా దగా

ధాన్యం విక్రయించడానికి రైతులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. లారీలు రాక, వర్షాలకు ధాన్యం తడిసి అవస్థలు పడ్డారు. గన్నీ సంచులు, హమాలీల కొరతతో ఎదురుచూపులు తప్పలేదు. మిల్లర్లు బస్తాకు 3 నుంచి 7కిలోల వరకు తరుగు విధించారు. లారీల కోసం పడిగాపులు కాసిన రైతులు డ్రైవర్లకు రూ.3వేల నుంచి రూ.6వేల వరకు నగదు చెల్లించి మరీ కొనుగోలు కేంద్రాలకు లారీల ను తీసుకెళ్లి ధాన్యం బస్తాలను లోడ్ చేసుకున్నా చార్జీల పేరుతో రైతుల జేబులు లూటీ చేశారనే ఆరోపణలున్నాయి.

తరుగు మాయాజాలం

గతంలో తేమ శాతంతో కోత విధించిన మిల్లర్లు ఈ ఏడాది తాలు, తప్ప అంటూ మెలిక పెట్టి క్వింటాల్‌కు 7కిలోల నుంచి 12కిలోల వరకు కోత విధించారు. ఒకటికి రెండుసార్లు తూర్పార పట్టినా మిల్లులకు వెళ్లిన తర్వాత తరుగు తప్పలేదని రైతులు వాపోయారు. 50కి పైగా కిలోమీటర్ల దూరంలోని రైస్‌మిల్లర్లకు కేటాయిస్తే పొల్లు, పెల్ల ఉందంటూ మిల్లర్లు కొర్రీలు పెట్టారు. మిల్లు దూరం కావడంతో రైతులు అక్కడికి వెళ్లలేని పరిస్థితి ఉండడంతో లారీ ట్రిప్‌కు సుమారు 20 నుంచి 30క్వింటాళ్ల వరకు తరుగు పేరిట రైతులను నష్టపర్చారు.

ట్యాబ్ ఎంట్రీ ఆలస్యం..

వారం పది రోజుల్లో జమ కావాల్సిన నగదు ట్యాబ్ ఎంట్రీ ఆలస్యంతో 20 రోజుల నుంచి నెల రోజులు గడుస్తోంది. నిర్వాహకులు ఎప్పటికప్పుడు రైతుల జాబితా, వారి వడ్లు ఎంత మొత్తంలో అమ్మకం చేశారో ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తే బ్యాంకు ఖాతాలో అధికారులు జమ చేసేవారు. నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది.

ఆలస్యం చేయకుండా వేయాలి



యాసంగిలో నాలుగెకరాల్లో వరి సాగు చేసిన. 210 బస్తాల వడ్లు వచ్చినయి. గత నెలలో వడ్లు అమ్మిన. 20 రోజులైనా పైసలు రాలేదు. రోజూ బ్యాంకుకు వెళ్లి ఖాతా చెక్ చేసుకునుడు అవుతుంది. వానాకాలం సాగుకు విత్తనాలు, ఎరువు కొందామని ఎదురు చూస్తున్నా. ఆలస్యం చేయకుండా వడ్ల పైసలు వేయాలి.

– కొత్తపల్లి స్వామి, గ్రామం: కుందారం, మం: జైపూర్

పదిహేను రోజులైనా పడలేదు..

వానకు నాని ఎండకు ఎండి, అరిగోస పడుతూ 20 రోజులు పడిగాపులు గాసి 180 బస్తాల వడ్లు అమ్మిన.. పదిహేను రోజులు అవుతుంది వడ్లు అమ్ముకొని.. ఇంకా పైసలు పడలేదు. అమ్ముకోవడానికి ఎదురు చూసుడే అయింది. ఇప్పుడు పైసల కోసం ఎదురు చూసుడు అవుతుంది.

– సుధాకర్, గ్రామం: పెద్దంపేట, మం: హాజీపూర్

పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- పరిశ్రమల స్థాపనకు యువత ముందుకు రావాలి
- ప్రభుత్వ విప్ బాల్క సుమన్



మాట్లాడుతున్న విప్ బాల్క సుమన్

పాతమంచిర్యాల: రాష్ట్ర వ్యాప్తంగా పారిశ్రామిక రంగం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని, అంతర్జాతీయ పరిశ్రమలు రాష్ట్రానికి తీసుకొచ్చి ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తోందని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తెలంగాణ పారిశ్రామిక ప్రగతి దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఏసీసీ ఏరియాలోని సూర్యకిరణ్ ఇండస్ట్రీస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్‌నేత, కలెక్టర్ బాదావత్ సంతోష్, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ ప్రజలకు పాలన పరమైన ఫలాలు అందించడానికి రాష్ట్రంలో జిల్లాల విభజనతోపాటు గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాలు, సమీకృత కలెక్టరేట్ భవనాలు, పోలీసు అధికారుల కార్యాలయాలు ఏర్పాటు చేసి సేవలందిస్తున్నామని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడానికి ప్రతీ జిల్లాలో వైద్య, నర్సింగ్ కళాశాలలు నెలకొల్పి వైద్యులు, సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు టీప్రైడ్, టీ ఐడియా కార్యక్రమాలకు అనుమతులు మంజూరు చేసి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. టీఎస్ఐ పాస్ చట్టం ద్వారా జిల్లాలో 2014 నుంచి ఇప్పటివరకు 548 యూనిట్లు, 765 అనుమతులు మంజూరు చేసినట్లు చెప్పారు. రూ.6,208కోట్ల పెట్టుబడితో 423 పరిశ్రమలు స్థాపించి 4,721 మందికి ఉపాధి కల్పించడానికి అనుమతులు పొంది 351 పరిశ్రమల్లో ఉత్పత్తి ప్రారంభించామని అన్నారు. టీ ఐడియా పథకం కోసం లబ్ధిదారులకు రూ.31.71 కోట్లు సబ్సిడీ మంజూరు చేశామన్నారు. టీ ప్రైడ్ పథకంలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారికి రూ.44.33 కోట్లు, ఎస్టీలకు రూ.14.34కోట్లు, దివ్యాంగులకురూ.2.63 కోట్లు సబ్సిడీ మంజూరు చేశామని అన్నారు. దళిత బంధు పథకంలో అర్హులైన యువత కలిసి జిన్నింగ్ మిల్లు, రైస్‌మిల్లు వంటి పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని, అవసరమైతే బ్యాంకుల నుంచి రుణ సదుపాయం కల్పించడానికి కృషి చేస్తామని చెప్పారు. పరిశ్రమలు స్థాపించిన యువ పారిశ్రామిక వేత్తలకు మెమెంటోలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో రైస్‌మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నల్మాసు కాంతయ్య, అధికారులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని ఆశాలు ఇంటింటికి వెళ్లి ఐదేళ్లలోపు చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై దృష్టి సారించాలని, వారికి అందిస్తున్న టీకాలు సరైన సమయానికి వేస్తున్నారా లేదా, ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉన్నాయా అని పరిశీలించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లాలోని 663 ఆశావర్కర్లకు ఐదు రోజులపాటు బ్యాచ్‌ల వారీగా అందించే శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం డీఎంహెచ్‌వో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారుల మరణాల శాతాన్ని తగ్గించాలనే ఉద్దేశ్యంతో హోం బేస్డ్ యంగ్ చిల్డ్రన్(హెచ్‌బీవైసీ) కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. చిన్నారుల ఆరోగ్య పరీక్షలపై అందించే శిక్షణను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని, జిల్లాలోని చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాతాశిశు జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నీరజ, డీపీవో ప్రశాంతి, సూపరింటెండెంట్ విశ్వేశ్వర్‌రెడ్డి, డీపీహెచ్‌ఎన్‌వో రత్నమాల, శివకుమార్, డెమో బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

గోదావరి నది పరిశుభ్రతకు చర్యలు చేపట్టాలి

- గోదావరి హారతి ఉత్సవ సమితి చైర్మన్ మురళీధర్‌రావు
- జిల్లాలో సాగిన గోదావరి హారతి యాత్ర



వేలాలలో గోదావరి నదికి హారతి ఇస్తున్న మురళీధర్‌రావు, పాల్గొన్న నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/చెన్నూర్/జైపూర్/లక్సెట్టిపేట: రాష్ట్రంలోని గోదావరి నది మురుగు నీరు, పరిశ్రమల రసాయనాలతో కలుషితమవుతోందని, నది పరిశుభ్రతకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని గోదావరి హారతి ఉత్సవ సమితి వ్యవస్థాపక చైర్మన్ పాల్సాని మురళీధర్‌రావు డిమాండ్ చేశారు. బాసర నుంచి భద్రాచలం వరకు చేపట్టిన గోదావరి హారతి యాత్ర మంగళవారం జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, జైపూర్, లక్సెట్టిపేట మండలాల్లో సాగింది. హాజీపూర్ మండలం వేంపల్లిలోని పద్మావతి గార్డెన్‌లో గోదావరి పరిరక్షణ సెమినార్ నిర్వహించారు. చైర్మన్ మురళీధర్‌రావు మాట్లాడుతూ గోదావరి నీరు కలుషితవుతున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే గోదావరి పరిరక్షణకు గోదావరి హారతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గోదావరి డిక్లరేషన్ ప్రకటిస్తామని తేల్చి చెప్పారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ మంచిర్యాల గోదావరి తీరం డంపింగ్ యార్డులా మారిందని విమర్శించారు. గోదావరి పరిరక్షణకు అంతా కలిసి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆనంద్‌కృష్ణ, రజనిశ్‌జైన్, క్యాతం వెంకటరమణ, పానుగంటి మధు, తాడూరి మహేశ్, గోదావరి హారతి ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

- చెన్నూర్‌లో మారుతీ మందిర్ వద్ద యాత్రకు విశ్వహిందు పరిషత్, బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. చైర్మన్ మురళీధర్‌రావు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌తో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రాచీన జగన్నాథాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ నాయకులు వెంకటేశ్వర్‌గౌడ్, చింతల శ్రీనివాస్, పెండ్యాల శ్రీకాంత్, కొంపల్లి బానేశ్, కొండపాక చారి, విశ్వహిందు పరిషత్ నాయకులు రత్న లక్ష్మీనారాయణరెడ్డి, మధుకర్ పాల్గొన్నారు.
- జైపూర్ మండలం వేలాల గ్రామానికి మంగళవారం సాయంత్రం యాత్ర చేరింది. మురళీధర్‌రావు, ఉత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్ హరిగోపాల్, రాష్ట్ర కో–కన్వీనర్ వెంకటరమణ వేలాల మల్లన్నస్వామిని దర్శించుకున్నారు. ఒగ్గు పూజారుల డోలు నృత్యాలతో గోదావరి నది వరకు ర్యాలీ నిర్వహించారు. గోదావరి నది వద్ద పూజలు చేసి హారతి కార్యక్రమం చేపట్టారు. గోదావరి హారతి మండల కన్వీనర్ డేగ నగేశ్, బీజేపీ మండల అధ్యక్షుడు చల్ల విశ్వంభర్‌రెడ్డి పాల్గొన్నారు.
- లక్సెట్టిపేట మండలంలోని గోదావరి నది వద్ద గోదావరి హారతి ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుంచి బైక్ ర్యాలీ చేపట్టారు. గోదావరి నదికి హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మండల నాయకులు హరిగోపాల్, గుండ ప్రభాకర్, వేముల మధు, గంగన్న, సతీష్, రత్నం, ఈశ్వర్, సుధాకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూతన నియామకం

భీమారం(చెన్నూర్): గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ లిమిటెడ్ జిల్లా చైర్మన్‌గా మండలంలోని కాజిపల్లి గ్రామానికి చెందిన కొమ్ము అశోక్‌యాదవ్ నియామకమయ్యారు. ఈ మేరకు మంగళ వారం ప్రభుత్వ విప్ బాల్క సుమన్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు టూటౌన్ ఎస్సై రవి కుమార్ తెలిపారు. రెండు నెలల క్రితం ఆస్పత్రి సమీపంలో కిందపడి ఉండగా గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించారు. సదరు వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుని వయస్సు 55 సంవత్సరాలు ఉంటాయని, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని వివరాలు తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచామని, వివరాలు తెలిసిన వారు 8712656562 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కుల, చేతివృత్తులకు రూ.లక్ష సాయం

మంచిర్యాలటౌన్: కుల, చేతివృత్తులు చేసుకునే వారికి రూ.లక్ష ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. https:// tsobmmsbc. cgg. gov. in వెబ్‌సైట్‌లో ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 20 నుంచి 26 వరకు ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లు దరఖాస్తుల పరిశీలన, సెలక్షన్ అయిన తర్వాత ఈ నెల 27 నుంచి జూలై 4 వరకు కలెక్టర్ వేసిన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అర్హులైన వారి జాబితాను సిద్ధం చేస్తారని ఆయన పేర్కొన్నారు. జూలై 15 వరకు మొదటి విడతలో చెక్కులు అందిస్తారని తెలిపారు. ఈ నెల 9న సీఎం జిల్లా పర్యటన నేపథ్యంలో పథకాన్ని జిల్లాలో అధికారికంగా ప్రారంభించనున్నట్లు సమాచారం.

సెల్‌ఫోన్ అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న సిబ్బంది

జన్నారం(ఖానాపూర్): జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన ప్రశాంత్ ఈ నెల 2న జన్నారంలో తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. అదేరోజు జన్నారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను కనుగొన్న పోలీసులు మంగళవారం బాధితునికి అప్పగించినట్లు హెడ్‌కానిస్టేబల్ రవీందర్ తెలిపారు.

ఐటీఐతో ఉపాధికి భరోసా



మంచిర్యాలలోని ఐటీఐ కళాశాల

- ప్రవేశాలకు ఈ నెల 10 వరకు గడువు
- ఉమ్మడి జిల్లాలో 18 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు
- అందుబాటులో 2,480 సీట్లు

మంచిర్యాలఅర్బన్: పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఐటీఐ చదువులు అందుబాటులో ఉండడమే కాకుండా త్వరగా ఉపాధిని అందిస్తున్నాయి. పదోతరగతి పూర్తయిన వెంటనే రెండేళ్ల వ్యవధిలోనే ఉపాధి చూపిస్తున్నాయి. పారిశ్రామిక అవసరాలకు తగిన మానవ వనరులను అందించేందుకు ఇండస్ట్రీయల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్(ఐటీఐ)లు ప్రవేశపెట్టారు. 2023–24 విద్యా సంవత్సరంలో ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. పదో తరగతిలో విద్యార్థులకు వచ్చిన గ్రేడింగ్ ఆధారంగాసీట్లు కేటాయించనున్నారు.

కోర్సులు ఇలా..

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ఐటీఐలు 6, ప్రైవేటు ఐటీఐలు 12 ఉన్నాయి. మంచిర్యాలలోని నాలుగు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో 520, ఆదిలాబాద్‌లోని రెండు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో 280 సీట్లు ఉన్నాయి. మంచిర్యాలలోని ఆరు ప్రైవేట్ కళాశాలల్లో 704, కుమురంభీంలోని ఒక ప్రైవేటు ఐటీఐలో 120, ఆదిలాబాద్‌లోని రెండు ప్రైవేట్ ఐటీఐలల్లో 280, నిర్మల్‌లోని మూడు ప్రైవేటు ఐటీఐలల్లో 480 సీట్లు ఉన్నాయి. అర్హులైన విద్యార్థులు htpp// iti. telangana. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏడాదిలో పూర్తయ్యే కోర్సులు

కోపా, డీజిల్ మెకానిక్, వుడ్‌వర్క్, టెక్నీషియన్, వెల్డర్, సేవింగ్ టెక్నాలజీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఫ్యాషన్ డిజైనింగ్, డ్రెస్ మేకింగ్, స్టెనోగ్రఫీ.

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	ఐటీఐలు	ట్రేడ్స్	సీట్లు
మంచిర్యాల	ప్రభుత్వ	4	520
	ప్రైవేట్	6	704
కుమురంభీం	ప్రైవేట్	1	120
ఆదిలాబాద్	ప్రభుత్వ	2	376
	ప్రైవేట్	2	280
నిర్మల్	ప్రభుత్వ	–	–
	ప్రైవేట్	3	480
మొత్తం			2,480

దరఖాస్తు చేసుకోవాలి

ఐటీఐలో ప్రవేశపెట్టిన అన్ని కోర్సులకు విస్తారమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయి. సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించి ఉపాధి అవకాశాలు విస్తృతం చేయడానికి ఐటీఐలు ఏర్పాటు చేశారు. అర్హులైన విద్యార్థులు ఐటీఐలో ప్రవేశానికి ఈ నెల 10లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

– చందర్, ప్రిన్సిపాల్, ఐటీఐ, మంచిర్యాల

మంచిర్యాల, ఆదిలాబాద్‌లోనే..

ఉమ్మడి జిల్లాలోని కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల్లో ప్రభుత్వ ఐటీఐ ఒక్కటి కూడా లేదు. ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, ఉట్నూర్‌లో మాత్రమే ప్రభుత్వ ఐటీఐలున్నాయి. పారిశ్రామిక ప్రాంతమైన మంచిర్యాల జిల్లాలో నాలుగు ఉన్నాయి. ఆరు ట్రేడ్‌లలో (224 సీట్లు), శ్రీరాంపూర్‌లో రెండు ట్రేడ్‌లు (96 సీట్లు), జన్నారంలో మూడు ట్రేడ్‌లలో (88) సీట్లు), మందమర్రిలో నాలుగు ట్రేడ్‌లలో (112 సీట్లు) అందుబాటులోఉన్నాయి.

రెండేళ్ల కోర్సులు

ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, ఎలక్ట్రీషియన్ మెకానిక్, మోటార్ వెహికిల్ మెకానిక్, వెల్డర్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్, డ్రాఫ్ట్‌మెన్ సీవీ, మిషనిస్ట్ టర్నర్ కోర్సులు ఉన్నాయి.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత?

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాపల్ ప్రాంతంలో మంగళవారం నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు సమాచారం. వరంగల్ నుంచి వచ్చిన ప్రత్యేక పోలీస్ బృందం మెరుపుదాడి చేసి ఒకరిని అదుపులోకి తీసుకుని అధికమొత్తంలో నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. విత్తనాలు ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఎవరి వద్ద కొనుగోలు చేశారు? ఇంకా ఎంతమంది వద్ద ఈ నకిలీ పత్తి విత్తనాలు ఉన్నాయనే కోణంలో విచారణ చేస్తున్న పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచినట్లు తెలుస్తోంది. ఈ విషయమై సీఐ మహేందర్‌రెడ్డిని వివరణ కోరగా ఇంత వరకు తనకు ఎలాంటి సమాచారం లేదన్నారు.

హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలి

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని సింగరేణి కోల్‌మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో స్టాండింగ్ కమిటీ ఆన్‌లేబర్ టెక్స్‌టైల్స్ అండ్ సిల్క్ డెవలప్‌మెంట్ పార్లమెంటరీ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సంబంధించిన సమస్యలను కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. కాంట్రాక్ట్ కార్మికులకు వేతనంతో కూడిన లీవ్‌లు ఇవ్వాలని, వైద్య సదుపాయం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఇనుపనూరి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు దొడ్డి నిర్మల, బండారి శ్యాంసుందర్, నాయకులు భూమయ్య, రమేశ్, సమ్మయ్య పాల్గొన్నారు.

ఫైనల్స్‌కు చేరిన నల్గొండ, నిజామాబాద్ జట్లు

రామకృష్ణాపూర్(చెన్నూర్): పట్టణంలోని ఠాగూర్ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి బాలికల ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మంగళవారం సాయంత్రం సెమీఫైనల్స్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. నల్గొండ, మంచిర్యాల జిల్లా జట్ల మధ్య చివరి వరకు ఆసక్తిగా సాగిన పోరులో 2–0 గోల్స్‌తో నల్గొండ జట్టు విజయం సాధించి ఫైనల్స్‌కు చేరింది. మరో సెమీఫైనల్ మ్యాచ్ నిజామాబాద్, మెదక్‌ల మధ్య జరుగగా 1–0 గోల్స్‌తో నిజామాబాద్ జట్టు గెలుపొందింది. బుధవారం ఉదయం నల్గొండ–నిజామాబాద్ జట్ల మధ్య ఫైనల్ పోటీ జరుగనుంది.



తలపడుతున్న నల్గొండ, మంచిర్యాల జట్లు

విద్యుత్‌షాక్‌తో ఇద్దరికి గాయాలు

- నూతన విద్యుత్‌లైన్ ఏర్పాటు పనులు చేస్తుండగా ఘటన

తాండూర్(బెల్లంపల్లి): విద్యుత్‌షాక్‌తో ఇద్దరు కార్మికులు గాయాలపాలైన సంఘటన మండలంలోని మాదారం 3 ఇంక్లైన్ వద్ద చోటు చేసుకుంది. మాదారం 3 ఇంక్‌లైన్ నుంచి నర్సాపూర్ గ్రామ పంచాయతీలోని బెజ్జాల వరకు ఐటీడీఏ నిధులతో నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. పశ్చిమబెంగాల్‌కు చెందిన సత్తర్, ఇజ్రాయిల్ స్తంభాలు ఎక్కి తీగలు అమరుస్తున్నారు. ఇదే సమయంలో విద్యుత్ సరఫరా జరగడంతో షాక్ గురై కిందపడిపోయారు. గమనించిన స్థానికులు ఆటోలో బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఎల్‌సీ తీసుకుని పనులు నిర్వహిస్తున్నట్లు కార్మికులు చెప్తుండగా విద్యుత్ సరఫరా ఎలా జరిగిందనేది తెలియడం లేదు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్ కు విద్యుత్ సరఫరా జరిగే అవకాశాలు లేవని, ఆ లైన్ పక్కనుంచే వాటర్ గ్రిడ్‌కు వెళ్తున్న 11కేవీ విద్యుత్‌లైన్ నుంచి ఇండక్షన్ జరిగి ఎర్త్ లాగా స్వల్ప విద్యుత్ సరఫరా జరిగి ఉండడంతోనే వారు కిందపడి ఉండవచ్చని విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు.



ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలఅర్బన్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిజ్ఞాస సంచార ప్రయోగశాలలో ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. భౌతిక, రసాయన, జీవశాస్త్ర అంశాలు బోధించే అనుభవం కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సైన్స్‌లో డిగ్రీ, మాస్టర్ డిగ్రీ చేసిన వారు ఈ నెల 8 లోగా డీఈవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ అభినందరాజుకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ఇన్నోవేషన్ చాలెంజ్‌కు ఎంపిక

మంచిర్యాలఅర్బన్: రాష్ట్రస్థాయి స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ 2023కు గర్మిళ్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టు ఎంపికైంది. ఇన్నోవేషన్ సెల్, ఇంక్విలాబ్, యూనిసెఫ్ సంయుక్త ఆధ్వర్యంలో స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ నిర్వహిస్తుంది. ఈ నెల 20 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు 125 ప్రదర్శనలను ఆన్‌లైన్‌లో పంపించారు. గర్మిళ్ల విద్యార్థులు విష్ణువర్ధన్, సీహెచ్ సాత్విక్, ఎం.వరలక్ష్మి, సీహెచ్ రిత్విక్ తయారు చేసిన ప్రాజెక్టు బహుళ ప్రయోజన ఫోల్డబుల్ లోడ్ క్యారియర్ ఎంపికై ందని డీఈవో యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు తెలిపారు.

హైవోల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం



కాలిపోయిన టీవీ

రెబ్బెన(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని 4వ వార్డులో మంగళవారం విద్యుత్ హైవోల్టేజీతో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం వీచిన బలమైన ఈదురు గాలులకు అంబేడ్కర్ కాలనీకి చెందిన పలువురు ఇళ్లలోకి హైఓల్టేజీ విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో కాలనీకి చెందిన దుర్గం రజితకు చెందిన కూలర్, చిలుముల దేవమ్మకు చెందిన కూలర్, రాంటెంకి కరుణకు చెందిన టీవీ, అనవేణి సుమలతకు చెందిన కూలర్‌తో పాటు ఫ్యాన్, దయ్యాల లక్ష్మికి చెందిన ఫ్యాను, నందు సింగ్‌కు చెందిన టీవీతో పాటు దుర్గం భరద్వాజ్‌కు చెందిన కంప్యూటర్‌తో పాటు ప్రింటర్ దగ్ధమయ్యాయి. ఈ విషయమై ఏఈ ఇమ్రాన్‌ను సంప్రదించగా బలమైన ఈదురుగాలుల కారణంగా కాలనీకి విద్యుత్ సరాఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద న్యూటల్ వైరు తెగిపోవటంతో హైఓల్టేజీ సరాఫరా అయినట్లు తెలిపారు.

9న ఉచిత చేపమందు పంపిణీ

దండేపల్లి(మంచిర్యాల): మృగశిరకార్తే సందర్భంగా ఈ నెల 9న దండేపల్లిలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో అస్తమా వ్యాధిగ్రస్తుల కోసం ఉచిత చేపమందు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామానికి చెందిన రంగసాయి ప్రేమ్‌సాగర్, భూలక్ష్మి దంపతులు ఈ చేపమందు వేయనున్నారు. మరిన్ని వివరాలకు 9440707416, 9866885308, 9908401985, 7601046055 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

పోలీస్ బెటాలియన్ విస్తృత కార్యక్రమాలు

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఆధ్వర్యంలో మంగళవారం కొలాంగూడలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ సురేశ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి గిరిజనులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గిరిజనులకు నిత్యావసర సరుకుల కిట్లు, విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్, బూట్లు, చెప్పులు అందజేశారు. అనంతరం గిరిజనులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ సురేశ్, అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్ చౌహాన్, బెటాలియన్ వైద్యాధికారులు డాక్టర్ సంతోశ్‌సింగ్, డాక్టర్ శ్రీధర్, ఆర్‌ఐలు, ఆర్ఎస్సైలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు అందిస్తున్న అధికారులు

షెజల్ ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- మాజీ మంత్రి గడ్డం వినోద్

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, అతని అనుచరుల వేధింపులు తాళలేక ఆత్మహత్యకు యత్నించిన ఆరిజిన్ డెయిరీ భాగస్వామి బోడపాటి షేజల్ ఘటనలో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీమంత్రి, కాంగ్రెస్ నేత గడ్డం వినోద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఢిల్లీలో షెజల్‌ను పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై ఇంతటి అరాచకం జరిగినా ఎవరూ పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. నేషనల్ ఉమెన్ రైట్స్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. షెజల్‌కు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి వినోద్

సుదర్శన్ మృతి తీరని లోటు



నివాళులర్పిస్తున్న నాయకులు

బెల్లంపల్లిరూరల్: మావోయిస్టు పార్టీ అగ్రనేత, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కటకం సుదర్శన్ మృతి బడుగు, బలహీన వర్గాల ప్రజలకు తీరని లోటని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని కృష్ణ అన్నారు. మంగళవారం బెల్లంపల్లిలోని కటకం సతీష్‌కుమార్ నివాసంలో సుదర్శన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ తన జీవితాన్ని ప్రజా ఉద్యమానికి అంకితం చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) నాయకులు రాజేంద్రప్రసాద్, వెంకటేశ్, రమేశ్, రాధ, ఆకాష్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

11న ప్రజాగర్జన విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

మందమర్రిరూరల్(చెన్నూర్): సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ నెల 11న కొత్తగూడెంలో నిర్వహించనున్న ప్రజాగర్జనను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఏరియాలోని కేకే–5 గనిపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతమంది వేజ్‌బోర్డు విషయంలో అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, వారి మాటలు పట్టించుకోవద్దన్నారు. సింగరేణి కార్మికులకు సొంత ఇంటిపథకం అమలు చేసి రెండు గుంటల భూమి, రూ. 20 లక్షల రుణ సౌకర్యం కల్పించాలని, నూతన బొగ్గు బ్లాకులను ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్నికల ముందు ముఖ్యమంత్రి కేసీఆర్ సింగరేణి ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సుదర్శన్, రాజేశం, శ్రీనివాస్, తిరుపతి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం హామీలు అమలు చేయాలి

- సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి



మాట్లాడుతున్న రాజారెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కార్మికులకు సొంతింటి పథకం అమలు చేస్తామని, మారుపేర్లతో పని చేసే వారిని క్రమబద్ధీకరిస్తామని, ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షల వడ్డీలేని రుణం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ నెల 9న నస్పూర్‌లో కలెక్టరేట్ ప్రారంభించేందుకు వస్తున్న సందర్భంగా ముఖ్యమంత్రి హామీలను అమలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఆ యూని యన్ బ్రాంచ్ కార్యదర్శి గోదారి భాగ్యరాజు, నాయకులు బోడకుంట శంకర్, రాజయ్య వెంగల శ్రీని వాస్, రాజేశం, పిట్ సెక్రెటరీ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల ముందు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న తూముల శ్రీనివాస్

పాతమంచిర్యాల: ఎన్నికలకు ముందు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు తూముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ఈ నెల 9న జిల్లా పర్యటనలో హామీలపై ప్రకటన చేయాలన్నారు. కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలకు ఎసరు పెట్టారన్నారు. పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామని చెప్పి రైతులపై కేసులు నమోదు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తుమ్మిడి హెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి నాలుగు నియోజకవర్గాలకు సాగునీరు అందించాలన్నారు. సమావేశంలో డివిజన్ కార్యదర్శి ఎ.లాల్‌కుమార్, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, నాయకులు తిరుపతి, మల్లన్న, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.